సాక్షి కామారెడ్డి

ఆదివారం । 16 । జూలై । 2023



సమస్యలు పరిష్కరించాలి

నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

- 8లో ▸



పెండింగ్ బిల్లులు చెల్లించండి

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు, బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.4 /22.5

ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నల్లకుంట మైసమ్మ ఆలయ ట్రస్టు ఏర్పాటు



కామారెడ్డి రూరల్: ఉగ్రవాయి గ్రామ శివారులోని నల్లకుంట మైసమ్మ ఆలయ ట్రస్టును ఏర్పాటు చేస్తూ దేవాదాయశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. బోర్డు సభ్యులుగా మాచారెడ్డి మండలం భవానీపేటకు చెందిన అక్కల మల్లాగౌడ్, ఆరేపల్లికి చెందిన బొర్ర లలిత, ఉగ్రవాయికి చెందిన గోపు శివకుమార్, క్యాసంపల్లికి చెందిన కోరంద నాగిరెడ్డి, ఉగ్రవాయికి చెందిన పొన్నాల నర్సింలులను నియమిస్తూ వరంగల్ రేంజ్ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ అర్చకుడిగా వేల్పూర్ కృష్ణను నియమించారు. నల్లకుంట మైసమ్మ ఆలయ ట్రస్టు ఏర్పాటు చేయడంతోపాటు బోర్డు సభ్యులుగా తమను నియమించినందుకు వారు శనివారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నెల రోజుల్లోగా బోర్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించన్నారు. దీంతోపాటు నూతన కార్యాలయాన్ని, అవసరమైన సిబ్బందిని నియమించనున్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



కామారెడ్డి క్రైం: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన మను చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టరేట్ ఏవో రవీందర్, డీఆర్‌డీవో సాయన్న, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి సాయిలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

22 మంది ఎస్సైల బదిలీ

కామారెడ్డి క్రైం: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 22 మంది ఎస్సైలను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ రాజన్న సిరిసిల్ల జోన్-3 డీఐజీ రమేష్‌నాయుడు శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నవారిని, సొంత జిల్లాలకు చెందిన ఎస్సైలను ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. కామారెడ్డి జిల్లా నుంచి 22 మంది ఎస్సైలు సిద్దిపేట, మెదక్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు వెళ్లారు. ఆయా జిల్లాల నుంచి ఇక్కడికి 24 మంది బదిలీ అయ్యారు.

సండే స్పెషల్

ఆ బడి.. బహుభాషల ఒడి

మద్నూర్‌లోని పాఠశాల ప్రాంగణం



- ఒకే ప్రాంగణంలో నాలుగు మీడియంలు
- మూడు నాలుగు భాషలు మాట్లాడుతున్న విద్యార్థులు
- ప్రత్యేకంగా నిలుస్తున్న మద్నూర్ పాఠశాల

'నోట్స్ రాసినవా'.. 'హోం వర్క్ కేలాస్‌కీ'.. 'హోం వర్క్ కరే క్యా'.. 'ఆర్ యూ ఫినిష్డ్ యువర్ హోం వర్క్'.. ఆ పాఠశాలకు వెళ్లిన వారికి ఇలా నాలుగు భాషల్లో మాట్లాడుతూ పిల్లలు కనిపిస్తారు. ఇదేంటి? ఒకేచోట ఇన్ని భాషలు మాట్లాడడమేమిటి అనుకుంటున్నారా..? అదే ఆ బడి ప్రత్యేకత. ఒకే ప్రాంగణంలో నాలుగు మీడియంలలో బోధిస్తున్న సర్కారు బడిపై 'సాక్షి' సండే స్పెషల్..

– సాక్షి, కామారెడ్డి/మద్నూర్

ఏ స్కూల్‌లోనైనా ఒక మీడియంలో బోధన జరుగుతుంది.. లేదా రెండు మాధ్యమాలు ఉంటాయి. కానీ మద్నూర్‌లోని ప్రభుత్వ పాఠశాల నాలుగు మీడియంలతో ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇక్కడ ఒకే ప్రాంగణంలో తెలుగు, ఉర్దూ, మరాఠీ, ఇంగ్లిష్ మీడియంలలో బోధన సాగుతోంది. ఎక్కడైనా తెలుగు, ఇంగ్లిష్ మీడియం స్కూళ్లుంటాయి. ముస్లిం జనాభా ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో ఉర్దూ మీడియం బడులు కనిపిస్తాయి. మద్నూర్ ప్రాంతం మహారాష్ట్రకు సరిహద్దుల్లో ఉన్నందున చాలామంది మరాఠీ కూడా మాట్లాడుతారు. అందుకే వారికోసం మరాఠీ మీడియం స్కూల్ నడిపిస్తున్నారు. ఇక్కడ చదివే చాలామంది విద్యార్థులు మూడునాలుగు భాషల్లో మాట్లాడుతారు.





810 మంది విద్యార్థులు...

మద్నూర్‌లో బాలుర ఉన్నత పాఠశాల 1938లో ప్రారంభమైంది. జుక్కల్ ప్రస్తుత ఎమ్మెల్యే హన్మంత్ సింధే కూడా ఇక్కడే చదువుకున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాల ప్రాంగణంలో నాలుగు మీడియంలలో బోధన సాగుతోంది. అన్ని పాఠశాలల్లో కలిపి మొత్తం 810 మంది విద్యార్థులున్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు, మరాఠీ మీడియం కొనసాగుతున్నాయి. ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియంలో 409 మంది విద్యార్థులు, మరాఠీ మీడియంలో 75 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇదే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల ఉంది. తెలుగు, మరాఠీ, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలలో బోధిస్తున్నారు. తెలుగు మీడియంలో 86 మంది, మరాఠీ మీడియంలో 18 మంది, ఇంగ్లిష్ మీడియంలో 19 మంది, ఉర్దూ మీడియంలో 77 మంది విద్యార్థులున్నారు. ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో 126 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ముచ్చటేస్తుంది



ఇక్కడ పిల్లలు రకరకాల భాషలు మాట్లాడుతుంటారు. వారిని చూస్తే ముచ్చటేస్తుంది. మరాఠీ చదివే వారు తెలుగు, తెలుగు చదివే వారు మరాఠీ.. ఇలా ఒకరి భాషను ఒకరు అనుకరిస్తుంటారు. తెలుగు విద్యార్థులకు మరాఠీ కూడా వస్తుంది.

– జ్యోతి, టీచర్, ప్రాథమిక పాఠశాల

ఇతర భాషలూ వచ్చు..



ఉర్దూ మీడియంలో చదువుతున్న నాకు తెలుగు, ఇంగ్లిష్, హిందీతో పాటు మరాఠీ భాషలు వచ్చు. అన్ని భాషలు మాట్లాడే ఫ్రెండ్స్ ఉన్నారు. ఇక్కడ చదివితే అన్ని భాషలు మాట్లాడడం వస్తుంది.

– ముస్కాన్, పదో తరగతి, ఉర్దూ మీడియం

సందడిగా ఉంటుంది



పాఠశాల ప్రాంగణం విద్యార్థులతో సందడిగా ఉంటుంది. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, మరాఠీ మీడియంలు ఉండడంతో అన్ని వర్గాల వారూ ఇక్కడ చదువుకునే అవకాశం లభిస్తోంది. పిల్లల్లో చాలామందికి మూడు నాలుగు భాషలు వస్తాయి.

– భీంరావ్, హెచ్ఎం, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

నాలుగు భాషల్లో..



మా పాఠశాలలో ఉపాధ్యాయులు చాలామందికి నాలుగు భాషలూ వచ్చు. ఒకే ప్రాంగణంలో ఇన్ని రకాల భాషలు మాట్లాడుకునే, చదువుకునే అవకాశం ఎక్కడా లేదు. పిల్లలు ఒకేచోట భిన్న భాషలు మాట్లాడుతుండడం గమ్మత్తుగా అనిపిస్తుంది.

–శివాజీ, హెచ్ఎం, ప్రాథమిక పాఠశాల

అన్ని భాషలు మాట్లాడుతం



నేను మరాఠీ మీడియంలో చదువుతున్న. మా ఇంట్ల మరాఠీ మాట్లాడుతరు. నాకు తెలుగు బాగా వచ్చు. దోస్తులందరితో తెలుగులో మాట్లాడుతా. మరాఠీలోనూ మాట్లాడుతా. అందరం అన్ని భాషలు మాట్లాడుతం. – ధన్‌రాజ్, పదో తరగతి, మరాఠీ మీడియం

అన్ని మీడియంలలో దోస్తులు..



స్కూల్‌లో అందరం కలిసుంటాం. లీజర్ పీరియడ్‌లో అందరం కలిసే ఆడుకుంటాం. తెలుగుతో పాటు అన్ని భాషల్లో మాట్లాడుతుంటాం. అన్ని మీడియంలలో మాకు దోస్తులున్నరు.

– అజయ్, పదో తరగతి, తెలుగు మీడియం

గొల్లకుర్మలు లేకున్నా.. గొర్రెలిచ్చినట!

- 11 మందికి గొర్రెలు పంపిణీ చేసినట్లుగా అధికార పార్టీ ప్రచారం
- సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన ఫ్లెక్సీ

దోమకొండ: ఆ ఊళ్లో గొల్లకుర్మలు ఒక్కరు కూడా లేరు. అయినా రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేసిందట.. 11 మందికి రూ. 10.31 లక్షల విలువైన లబ్ధి చేకూర్చారట.. ఇది ప్రతిపక్షాల ఆరోపణ కాదు.. అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చెబుతున్న వాస్తవం. గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించి గొట్టిముక్కల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజాప్రతినిధులు, నాయకుల ఫొటోతో ఏర్పాట చేసిన ఫ్లెక్సీలో 11 మంది లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. దీనికి రూ.



బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

10,31,250 వెచ్చించినట్లు అందులో ఉంది. అయితే గ్రామంలో గొల్లకుర్మలే లేరని గ్రామస్తులు చెబుతున్నారు. గొల్లకుర్మలే లేనిచోట గొర్రెలను ఎవరికి పంపిణీ చేశారన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ ఫ్లెక్సీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

వానొచ్చే.. వరదొచ్చే..

- ఎగువన భారీ వర్షాలు
- వాగులకు జలకళ

నిజాంసాగర్: వర్షాకాలం ఆరంభమై నెలన్నర గడిచినా సరైన వర్షాలు లేక డీలా పడిన రైతాంగానికి వరుణుడు ఊరటనిచ్చాడు. శుక్ర, శనివారాల్లో ఎగువన వానలు దంచికొట్టడంతో నిజాంసాగర్ మండలంలోని వాగులు, వంకలు పారుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్, కంగ్టి, నారాయణఖేడ్, నిజాంపేట మండలాల్లో కురిసిన వర్షాలకు నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామ శివారులోని నల్లవాగు మత్తడి పారుతోంది. నిన్నటివరకు ఇసుక మేటలతో దర్శనమిచ్చిన నల్లవాగులో శనివారం తెల్లవారు జామున వరద నీటి పరవళ్లు కనిపించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నల్లవాగు మత్తడి అలుగుపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో వాగు ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వరద నీటితో పొంగిపొర్లుతున్న నల్లవాగు మత్తడి

అలుగు పారిన శేర్‌ఖాన్‌పల్లి మత్తడి..

ఎగువన ఉన్న వర్ని, బాన్సువాడ మండలాల్లో దంచికొట్టిన వర్షానికి మండలంలోని శేర్‌ఖాన్‌పల్లి వాగు మత్తడి పారింది. దీంతో సింగితం రిజర్వాయర్‌లోకి వరద నీటి ప్రవాహం వస్తోంది. వాగు మత్తళ్లు అలుగు దూకుతుండడంతో చుట్టు పక్కల గ్రామాల రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ.లలో..)				
		జుక్కల్	51.4	తాడ్వాయి	14.8
		పిట్లం	47.2	లింగంపేట	14.2
బాన్సువాడ	122.0	బిచ్కుంద	33.2	భిక్కనూరు	7.4
పెద్దకొడప్‌గల్	105.2	నిజాంసాగర్	31.6	సదాశివనగర్	6.0
గాంధారి	100.6	రాజంపేట	20.0	నాగిరెడ్డిపేట	3.8
బీర్కూర్	70.4	ఎల్లారెడ్డి	19.6	దోమకొండ	1.6
నస్రుల్లాబాద్	60.2	మద్నూర్	15.0		

కౌలాస్‌లోకి 972 క్యూసెక్కుల రాక

నిజాంసాగర్(జుక్కల్): సరిహద్దుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శనివారం జుక్కల్ మండలం కౌలాస్‌నాలా ప్రాజెక్టులోకి 972 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీ) కాగా శనివారం సాయంత్రానికి 455.5 మీటర్ల(0.711 టీఎంసీ) నీరు నిల్వ ఉంది.

బొప్పాస్‌పల్లిలో విచారణ

నస్రుల్లాబాద్: బొప్పాస్‌పల్లిలో జీవో నంబర్ 58, 59 ప్రకారం క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న ఇళ్లను శనివారం జెడ్పీ సీఈవో సాయాగౌడ్ పరిశీలించారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న గ్రామానికి చెందిన ఎనిమిది మంది ఇళ్ల స్థలాలను సర్వే చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బావయ్య, ఆర్‌ఐ అంజు, సర్వేయర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి డీఎస్పీ బదిలీ

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి డీఎస్పీ సురేశ్‌ను తొర్రూర్‌కు బదిలీ చేస్తూ శనివారం రాత్రి డీజీపీ అంజనికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

ఎల్లారెడ్డి ఆర్డీవోగా రాథోడ్ రమేష్

ఎల్లారెడ్డి ఆర్డీవోగా రాథోడ్ రమేష్ రానున్నారు. ఇక్కడ పనిచేసిన శ్రీను బదిలీ అయిన విషయం తెలిసిందే.

'పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: యువత పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. జిల్లాకేంద్రంలోని కళాభారతిలో శనివారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువజనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలోనూ రాణించాలన్నారు. సేవాభావాన్ని అలవర్చుకోవాల సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైందన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యువజనోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచినవారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. అక్కడ రాణించిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఉపన్యాస, వ్యాసరచన, పెయింటింగ్, నృత్యం, చిత్రలేఖనం అంశాలలో గెలుపొందినవారికి నగదు బహుమతులను అందించారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్ల ను కలెక్టర్ తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త శైలి, జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, ఎన్నికల నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా మత్స్య శాఖాధికారి వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో 'మహోన్నతం'!

- ఎస్సై నుంచి ఎస్పీ దాకా..
- ఎన్నో పతకాలు సాధించిన శ్రీనివాస్‌రెడ్డి
- కేసులను ఛేదించడంలో దిట్టగా గుర్తింపు

సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఏటా ఇచ్చే మహోన్నత సేవా పతకానికి ఎంపికైన ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి కెరీర్ కామారెడ్డి జిల్లాలోనే ప్రారంభమైంది. శిక్షణ ఎస్సైగా జిల్లాకు వచ్చి బాన్సువాడ ఠాణాలో కెరీర్ మొదలుపెట్టారు. అక్కడే ఎస్సైగా పనిచేసి ఎన్నో కేసులు ఛేదించి, అధికారుల మెప్పు పొందారు. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా వివిధ హోదాల్లో, వివిధ జిల్లాల్లో పనిచేసిన ఆయన.. ఏడాదిన్నర క్రితం జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన తనదైన శైలిలో పనిచేస్తూ మహోన్నత సేవా పతకానికి ఎంపికయ్యారు.

వరించిన పతకాలెన్నో..

శ్రీనివాస్‌రెడ్డి ఎస్సైగా బాన్సువాడలో తొలి పోస్టింగ్ తీసుకున్నపుడు నక్సలైట్ల కార్యకలాపాలు జోరుగా సాగేవి. ఆ సమయంలో శ్రీనివాస్‌రెడ్డి చొరవతో చాలామంది నక్సలైట్లు లొంగిపోయారు. పలు ఎన్‌కౌంటర్లలో కూడా ఆయన పాల్గొన్నారు. దీంతో అప్పటి ప్రభుత్వం ముఖ్యమంత్రి శౌర్య పతకంతో సత్కరించింది. తర్వాత బోధన్, నిజామాబాద్ వన్ టౌన్, త్రీ టౌన్‌లలో పనిచేశారు. అనంతరం సీఐగా పరిగి, వనపర్తి, జీడిమెట్లలో పనిచేశారు. జీడిమెట్లలో పనిచేసినపుడు పోలీసు స్టేషన్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్ లభించింది. డీఎస్పీగా వనపర్తిలో, ఇంటెలిజెన్స్‌లో పనిచేశారు. హైదరాబాద్‌లో అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్నపుడు దోపిడీ ముఠాలను పట్టుకోవడంలో ఆయన కీలకంగా పనిచేశారు. తర్వాత వివిధ జిల్లాల్లో పనిచేశారు.



ఎస్సైగా పనిచేసిన జిల్లాకే...

పోలీసు శాఖలో ఎస్సైగా తొలి పోస్టింగ్ తీసుకున్న కామారెడ్డి జిల్లాకే పదోన్నతి పొంది ఎస్పీగా వచ్చారు శ్రీనివాస్‌రెడ్డి. ఏడాదిన్నరగా ఆయన జిల్లాలో పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో చాలా కాలం పనిచేయడం వల్ల జిల్లాపై ఆయనకు పట్టుంది. అధికారులు, సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ ప్రశంసలందుకుంటున్నారు.

కేసుల ఛేదనలో...

ఆధారాలు లేకుండా జరిగే హత్యలు, దొంగతనాలు, దోపిడీ కేసులెన్నింటినో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తనదైన శైలిలో ఛేదించారు. సంఘటన స్థలానికి వెళ్లి కేసు దర్యాప్తు అధికారులకు దిశానిర్దేశం చేస్తుంటారు. జిల్లాలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా వెంటనే స్పందించి అధికారులను అప్రమత్తం చేయడం, తను వెళ్లడం ద్వారా నేరస్తులను పట్టుకోవడానికి కావలసిన ప్రణాళిక రచిస్తారు. నేర విచారణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలని సిబ్బందికి చెబుతుంటారు. ఆయన సారథ్యంలో అంతర్రాష్ట్ర దొంగల ముఠాలెన్నో జిల్లా పోలీసులకు చిక్కాయి.

రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రమాదాలను నివారించాలంటే కొంత కఠినంగా వ్యవహరించాలన్నది ఆయన విధానం. ఉల్లంఘనలకు జరిమానాలు విధించడం ద్వారా జాగ్రత్త పడతారని ఆయన రకరకాలుగా కట్టడి చేసే ప్రయత్నాలు చేశారు. జాతీయ రహదారితో పాటు స్టేట్ హైవేలపైనా స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాకేంద్రంలో ప్రధాన కూడళ్ల వద్ద హైరిజల్యూషన్ కెమెరాలను ఏర్పాటు చేయించి ఎస్పీ కార్యాలయంతో అనుసంధానించారు. ఎస్పీ కార్యాలయంనుంచి ట్రాఫిక్ ఉల్లంఘనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. గతేడాది ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి రూ.10 కోట్ల జరిమానాలు విధించారు.

సంతోషంగా ఉంది

నా కెరీర్ ఈ జిల్లాలోనే మొదలైంది. ఎస్సైగా ఇక్కడ ఉన్నప్పుడే సీఎం శౌర్య పతకాన్ని అందుకున్నాను. ఎస్పీ హోదాలో ఈ జిల్లాలో ఉన్నప్పుడే మహోన్నత పురస్కారం రావడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. గతంలో ఎన్నో పురస్కారాలు వచ్చాయి. శాంతిభద్రతల పరిరక్షణకు మరింతగా తోడ్పడడానికి ప్రయత్నిస్తా. – శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ, కామారెడ్డి

'యూసీసీ ఎవరికీ వ్యతిరేకం కాదు'



కామారెడ్డి టౌన్: యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) ఎవరికీ వ్యతిరేకం కాదని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో విలేకరులతో మాట్లాడారు. యూసీసీ చట్టంపై కొంతమంది పనిగట్టుకుని ప్రజలలో అపోహలు పెంచుతున్నారని ఆరోపించారు. అవగాహన కల్పించి, అపోహలు తొలగించేందుకు ఈనెల 19న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ.. నిజాం సాగర్ చౌరస్తా, కమాన్, సుభాష్ రోడ్, జేపీఎన్ రోడ్, సిరిసిల్ల రోడ్‌ల మీదుగా సాగి ఇందిరా చౌక్ వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మతాలకు చెందినవారు ఈ ర్యాలీలో పాల్గొని ఐక్యత చాటాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మహమ్మద్ నేహాల్, శ్రీకాంత్, విపుల్, నరేందర్, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓపీఎస్ అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: డీఎస్సీ 2003 ఉపాధ్యాయులను పాత పెన్షన్ పథకం(ఓపీఎస్) పరిధిలోకి తీసుకురావాలని జిల్లా ఉపాధ్యాయులు మంత్రి హరీష్‌రావును కలిశారు. శనివారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ఛలో సిద్దిపేట కార్యక్రమానికి తరలివెళ్లారు. అక్కడ మంత్రిని కలిసి సమస్యను విన్నవించారు.

కబ్జా నుంచి కాపాడండి



దోమకొండ: మండలంలోని ముత్యంపేటలో కబ్జాకు గురైన తమ ప్లాట్ల భూమిని కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ సంజయ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముత్యంపేట శివారులోని సర్వే నెంబర్ 74/2 ప్రభుత్వ భూమిలో తమకు 1999లో అప్పటి ప్రభుత్వం 100 మంది పేదలను గుర్తించి ప్లాట్లు కేటాయించిందన్నారు. కానీ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధుల సహకారంతో సద్దిపెద్ద అంజయ్య సదరు భూమిని దున్నుతున్నాడని వారు తెలిపారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉపసర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్తులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 5, 7, 8వ తరగతులలో మిగిలిన సీట్లకు ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 18లోగా దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి



నిజాంసాగర్(జుక్కల్): డబుల్ బెడ్రూం ఇళ్ల బిల్లులు, అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరుతూ జుక్కల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు శనివారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కలిశారు. సీనియర్ నాయకుడు వెంకట్రాంరెడ్డికి రాష్ట్ర కార్పొరేషన్ పదవి ఇవ్వాలని మంత్రిని కోరినట్లు తెలిసింది. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సైతం నేతలు కలిశారు.

కలుపు మందు పిచికారీలో రైతులు బిజీబిజీ



మద్నూర్(జుక్కల్): ఖరీఫ్ పంటలైన సోయాబీన్, పత్తి, పెసర పంటల్లో కలుపు పెరిగిపోవడంతో శనివారం రైతులు కలుపు కోసం మందులను స్ప్రే చేయడంలో బిజీబిజీగా మారారు. గత రెండు రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండి వర్షాలు తగ్గిపోవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సోయ పంటలు విపరీతంగా కలుపు పెరిగిపోయిందని రైతులు గడ్డి మందులు స్ప్రే చేస్తున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

- తరచుగా ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమం వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



కామారెడ్డి - ఎల్లారెడ్డి రహదారిపై మూలమలుపు



బ్రహ్మాజీవాడి శివారులో మూలమలుపు వద్ద ప్రమాదానికి గురైన స్కూల్‌బస్సు (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాల్లోకి వెళ్లే దారుల్లోని మూలమలుపులు ప్రమాదకంగా మారాయి. గత కొన్ని సంవత్సరాలుగా మూలమలుపులు ఉన్నటికీ, సూచికలు లేకపోవడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయాగ్రామాల ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో జరిగిన ప్రమాదాలు...

తాడ్వాయి మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమం వద్ద కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మూల మలుపు ఉండడంతో ఎన్నోమార్లు ప్రమాదాలు జరిగాయి. అలాగే కృష్ణాజివాడి శివారులోని ప్రధాన రహదారిలో మూలమలుపు ఉండడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డికి వెళుతున్న లారీ కృష్ణాజివాడిలో ఓవర్ స్పీడ్‌తో వచ్చి రోడ్డు పక్కన ఉన్న ఇంటిని ఢీకొట్టడంతో ఆ ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. రెండు సంవత్సరాల క్రితం బ్రహ్మాజీవాడి శివారులోని సామిల్ వద్ద గల కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మూలమలుపు వద్ద ఓ ప్రయివేటు స్కూల్‌బస్సు అదుపుతప్పి రోడ్డు కిందికి పోవడంతో అందులో ప్రయాణిస్తున్న 20మంది విద్యార్థులకు తీవ్రగాయాలు అయ్యాయి. అదే స్థలంలో ఎన్నోసార్లు కారులు, బైక్‌లు అదుపుతప్పి బోల్తాపడ్డాయి. మండలంలోని ఎండ్రియాల్ శివారులోని మూలమలుపు వద్ద ఎన్నో మార్లు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. మండలంలోని ఎర్రాపహాడ్ శివారు, కన్‌కల్ శివారు, కరడ్‌పల్లి, బ్రాహ్మణపల్లి శివారు, చిట్యాల, సంతాయిపేట్ శివారులోగల రోడ్లపై మూలమలుపులు ఉండడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని మూలమలుపుల వద్ద రోడ్లను నేరుగా చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మూలమలుపులు అధికంగా ఉన్నాయి. ఈ మూలమలుపుల వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని తగిన చర్యలు చేపట్టాలి

– వెంకట్‌రాంరెడ్డి, తాడ్వాయి

మూలమలుపులను సరిచేయాలి..



మండలంలోని రహదారులపై మూలమలుపులు ఉన్న రోడ్లను సరిచేయాలి. అధికారులు సర్వేచేసి ఎక్కడయితే మూలమలుపులు ఉన్నాయో వాటిని గుర్తించి వాహనాలు ఈ రోడ్లపై నేరుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

– బాపురావు, తాడ్వాయి

మహాధర్నాలో కాంట్రాక్టు అధ్యాపకులు



మహాధర్నాలో పాల్గొన్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

భిక్కనూరు: విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన మహాధర్నాలో తెయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు. తెయూ సౌత్‌క్యాంపస్, మెయిన్‌క్యాంపస్‌లకు చెందిన 40 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ధర్నాలో పాల్గొన్నారని వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ప్రధాన క్యాంపస్, సౌత్ క్యాంపస్ కాంట్రాక్టు అధ్యాపకులు దత్తహరి, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, రమాదేవి, రాజేశ్వర్, పురుషోత్తం గోపిరాజు, నిరంజన్, వైశాలి, శ్రీమాత, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కాలువకు గండి



వరద కాలువకు బుంగ పడిన దృశ్యం

గాంధారి: మండలంలోని తిమ్మాపూర్‌లో గల మాలకుంట వరద కాలువ చెక్ డ్యామ్ వద్ద బుంగ, కాలువకు గండి పడి నీరు వృథాగ పోతుంది. కుంటలోకి నీరు రావడం కోసం గ్రామ శివారులో ఉన్న వాగుకు చెక్ డ్యామ్ నిర్మించి దాని నుంచి కుంటలోకి కాలువ ఏర్పాటు చేశారు. కొందరు గతేడాది చెక్ డ్యామ్ వద్ద వరద కాలువకు గండి కొట్టారు. దానికి తోడు ఓ రైతు కాలువకు గండి కొట్టాడు. దీంతో కుంటలోకి నీరు చేరడం లేదు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ర్యాగింగ్ భూతాన్ని తరమికొట్టాలి



కామారెడ్డి టౌన్: ర్యాగింగ్ భూతాన్ని తరమికొట్టాలని కామారెడ్డి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి తిరుచినపల్లి ఎస్‌పి భార్గవి అన్నారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యా సంస్థల్లో, ఇతర ప్రాంతాలలో తోటి విద్యార్థులను, యువకులు, యువతులను వేధింపులకు, ర్యాగింగ్‌లకు గురి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. న్యాయసేవ సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రమేష్‌చంద్, డిప్యూటి కౌన్సిల్ సభ్యుడు చిరంజీవి పాల్గొన్నారు.

బాన్సువాడలో భారీ వర్షం



బాన్సువాడ: బాన్సువాడలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రస్తుతం వరి నాట్లు వేస్తున్న నేపథ్యంలో ఈ వర్షం రైతులకు ఊపిరినిచ్చింది.

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్‌లో శుక్రవారం 70.8మి.మీ వర్షాపాతం నమోదు అయిందని తహసీల్దార్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జలమయమైన వీధుల్లో అధికారులు చర్యలు తీసుకుని నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్


రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



లింగం(ఫైల్)

నిజామాబాద్ సిటీ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నిజామాబాద్ రూరల్ ఎస్సై జి లింబాద్రి తెలిపారు. నగరంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన తోందూరు లింగం(43) శుక్రవారం రాత్రి నిజామాబాద్ రూరల్ మండలం కాలూర్ గ్రామానికి బయలు దేరాడు. కాలూర్‌కు సమీపంలో పందులు అడ్డురావడంతో వాటిని తప్పించబోయి బైక్ అదపు తప్పి లింగం రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం రాత్రి మృతి చెందాడు. లింగంకు భార్య సుమలత, కుమార్తెలు సింధూజ, సంకీర్తన ఉన్నారు. మృతుడి తమ్ముడు సంజీవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ కింద పడి ఒకరు..



రమేశ్ మృతదేహం

సదాశివనగర్: మండలంలోని భూంపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు ఒకరు ట్రాక్టర్ కింద పడి శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. భూంపల్లికి చెందిన ఈదులాయ రమేశ్(49) అనే వ్యక్తి తన సొంత ట్రాక్టర్‌తో వ్యవసాయ భూమిలో దున్నుతున్నాడు. ఈ క్రమంలోపై మడి నుంచి కింద మడికి ట్రాక్టర్‌ను దింపుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా కొట్టింది. దీంతో రమేశ్ ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయాడు. తలకు, ఛాతి భాగంలో గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులో ప్రధాన రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మాచారెడ్డి మండలం ఫరీద్‌పేటకు చెందిన నర్సింలు బైక్‌పై కామారెడ్డికి వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి మరో వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నర్సింలుకు తీవ్ర గాయాలు కాగా కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని ఎన్జీవోస్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచి, తరలించేందుకు లారీలో లోడ్ చేస్తున్న 74 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎర్రం శ్రీనివాస్ అనే వ్యాపారి కాలనీలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచాడు. శనివారం ఉదయం వాటిని లారీలోకి ఎక్కిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. మొత్తం 176 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై నరేష్ తెలిపారు.

బాలుడి అదృశ్యం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముబారక్‌నగర్‌కు చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు ఎస్సై లింబాద్రి శనివారం తెలిపారు. ముబారక్‌నగర్‌కు చెందిన భార్గవ్(17) శుక్రవారం సాయంత్రం తన స్నేహితుడు ఇంటికి వెళ్లివస్తానంటూ తల్లికి చెప్పివెళ్లాడు. రాత్రి అయిన ఇంటికి చేరుకోక పోవటంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దాంతో శనివారం రాత్రి బాలుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆలయంలో చోరీ

మాక్లూర్: మండలంలోని బొంకన్‌పల్లి శివారులో గల సాయిబాబా ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. సీసీ కెమెరాకు సంబంధించిన మానిటర్, హుండీని పగుల కొట్టి అందులోని రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల మండలంలోని ఆలయాల్లో చోరీలు జరుగుతున్నాయి. పోలీసులు నిఘా పెట్టి దొంగలను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





ఆర్గొండలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు.. గుర్జాల్ గ్రామంలో..

పంటల పరిశీలన

రాజంపేట/గాంధారి/పెద్దకొడప్‌గల్/లింగంపేట/మద్నూర్(జుక్కల్): జిల్లాలోని పలు మండలాల్లో శనివారం పంటపొలాలను స్థానిక ఏవోలు, ఏఈవోలు పరిశీలించారు. రాజంపేట మండలంలోని ఆర్గొండ గ్రామంలోని పంటలను ఏడీఏ అపర్ణ పరిశీలించారు. మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, కంది పంటలలో ఆశించే పురుగులు, తెగుళ్ల పై అవగాహన కల్పించారు. గాంధారి మండలంలో ఏవో నరేష్, ఏఈవోలు సోయాబీన్, మక్క తదితర పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పెద్దకొడప్‌గల్ మండలంలో కాటేపల్లి గ్రామ శివారులో పత్తి పంటను ఏవో నదీమ్ పరిశీలించిన రైతులకు పలు సూచనలు చేశారు. సర్పంచ్ విఠల్, ఏఈవో రూప ఉన్నారు. లింగంపేట మండలంలోని మోతె గ్రామ శివారులో సోయాబీన్, మొక్కజొన్న పంటలను ఏవో అనిల్ కుమార్ పరిశీలించారు.ఏఈవో సంతోష్‌కుమార్, రైతులు సుధాకర్‌రెడ్డి, సత్తయ్య, భాస్కర్ ఉన్నారు. మద్నూర్ మండలంలోని పెద్ద తడ్గూర్ శివారు పంటపొలాలను ఏవో రాజు పరిశీలించారు. పొలాల్లో పీఎస్‌బీ మందును చల్లడం ద్వారా భూమిలో ఉండే భాస్వరం కరిగి మొక్క వేర్లకి అందిస్తాయని ఆయన రైతులకు సూచించారు. ఏఈవో సతీష్, గంగారం, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



మోతె గ్రామంలో..



కాటేపల్లి గ్రామంలో..

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించాలి





నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో సమస్యలను తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు.. జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో నెలకొన్న సమస్యలను వారంరోజుల్లో పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. 'సాక్షి' దినపత్రికలో శనివారం 'అంధకారంలో పీహెచ్‌సీ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి వారు స్పందించి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అలాగే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి కామారెడ్డి డీఎంహెచ్‌వోను ఫోన్ ద్వారా కోరారు. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీని శనివారం ఎంపీపీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన సందర్శించారు. నాయకులు ధనుంజయ్, జనార్దన్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గోప్యా, సాయిలు, రాకేష్, విఠల్ తదితరులున్నారు.

వర్సిటీ విద్యార్థుల గోస పట్టదా



తెయూలో నిరసన చేపట్టిన ఎస్ఎఫ్ఐ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి):తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థుల గోస ప్రభుత్వానికి పట్టదా అంటూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వర్సిటీ కార్యదర్శి శ్రీశైలం విమర్శించారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వర్సిటీ తరగతులు బహిష్కరించి బంద్ పాటించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. తెయూ ఇన్‌చార్జి వీసీగా నియామకమైన రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ యూనివర్సిటీని సందర్శించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని, బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వర్సిటీ హాస్టల్స్‌లో సదుపాయాలు కల్పించాలని లేదంటే రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విగ్నేష్, తెయూ అధ్యక్షుడు ప్రసాద్, వెంకటేష్, దినేష్, చరణ్, పవన్, సంధ్య, మహేష్ పాల్గొన్నారు.

గృహ హింస చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

ఖలీల్‌వాడి: గృహ హింస చట్టం, వర్నకట్న నిషేధ చట్టం, సెక్షన్ 498ఏ పై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు శనివారం అవగాహన కల్పించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఏసీబీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవి రాజ్, రాజ్ గోపాల్‌గౌడ్, కవితా రెడ్డి, నంద రమేష్, శేషు, నిమ్మ దామోదర్‌రెడ్డి, సమ్మయ్య, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీసీని కలిసిన రిజిస్ట్రార్

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కళాశాల విద్యాకమిషనర్, తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణను శనివారం తెయూ రిజిస్ట్రార్ యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రి సైతం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శనివారం డిగ్రీ 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు జరిగాయి. 11 మంది విద్యార్థులకు 9 మంది పరీక్ష రాసినట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు.

హాస్టల్‌లో ఉండి చదువుకొమ్మన్నందుకు..

- విద్యార్థిని ఆత్మహత్య



శ్రీనిజ(ఫైల్)

రాజంపేట: హాస్టల్‌లో ఉండి చదువుకొమ్మని తల్లి చెప్పడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రాజంపేటలో శనివారం చోటు చేసుకుంది. ఎఎస్సై రఘు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గడ్డమీది భాగ్యలక్ష్మికి కూతురు శ్రీనిజ (16) ఉంది. ఆమె భర్త గతంలో చనిపోవడంతో భాగ్యలక్ష్మి కూతురితో కలిసి రాజంపేటలో తల్లిదండ్రుల దగ్గర ఉంటూ జీవనం సాగిస్తోంది. శ్రీనిజ స్థానిక కేజీబీవీలో పదో తరగతి వరకు చదువుకుంది. ప్రస్తుతం కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. అయితే కేజీబీవీలో ఉన్న మాదిరిగా ప్రస్తుతం హాస్టల్‌లో ఉండి చదువుకొమ్మని శ్రీనిజకు తల్లి సూచించింది. తాను ఇంటి వద్ద ఉండే చదువుకుంటానని శ్రీనిజ మొండికేసింది. దీంతో నెల రోజులుగా నిత్యం ఇంటి నుంచే కాలేజీకి వెళ్తోంది. హాస్టల్‌లో ఉండమని తల్లి తరుచు కోరుతుండటంతో మనస్తాపం చెందిన శ్రీనిజ శనివారం ఇంట్లో ఉరి వేసుకుంది. భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

విద్యార్థినులను కిడ్నాప్ చేసిన ఇద్దరిపై కేసు

రెంజల్: విద్యార్థినులను కిడ్నాప్ చేసిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పండ్ల సాయన్న చెప్పారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు రెంజల్‌లో పదో తరగతి చదువుతున్నారని చెప్పారు. శుక్రవారం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న వారిని అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి కిడ్నాప్ చేశారని ఎస్సై తెలిపారు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకులపై కిడ్నాప్ కేసు నమోదు చేశామన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బొలెరో



నిజామాబాద్ సిటీ: ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్‌కు వస్తున్న బొలెరో వాహనం డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ముబారక్‌నగర్ వద్దకు రాగానే డివైడర్‌ను వాహనం నడుపుతున్న వ్యక్తి గుర్తించలేదు. దాంతో వాహనం డివైడర్‌ను ఎక్కి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. కాగా వాహనం వెనుక బైక్‌పై వస్తున్న వ్యక్తి వాహనాన్ని ఢీకొని గాయపడ్డాడు. అతడిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.